




Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com








ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 641 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర ఆదివారం 18 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం


# కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపుతుంది

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాభివృద్ధిలో భాగం కావాలి

- -గత ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడిదారుల్ని బెదిరించింది- -కూటమి ప్రభుత్వం వేధించదు అండగా ఉంటుంది

- -పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు గేమ్ ఛేంజర్- దేశ కాలుష్యరహిత ఇంధన ప్రయాణంలో కీలక మైలురాయి

-పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని అగ్రప్రధాన నిపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఆ దిశగా వేసిన బలమైన అడుగు ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - ప్రభుత్వాలు మారినా పాలనా విధానాలు స్థిరంగా ఉండాలి

- కాకినాడలో ఏఎం గ్రీన్ వారి గ్రీన్ ఆమ్మోనియా ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్


కాకినాడ, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, జనవరి 17 : ప్రభుత్వాలు, పార్టీలు మారినా పరిపాలనా పరమైన విధానాలు మాత్రం స్థిరంగా ఉండాలి. గత పాలకులు - రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడిదారులను బెదిరించి, కోర్టుకు ఈడ్చి నానా ఇబ్బందులుపెట్టారు. కూటమి ప్రభుత్వం మాత్రం ప్రతి అడుగులో పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపుతుంది. వారికి అండగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని మా ప్రభుత్వం నుంచి పెట్టుబడిదారులకు ఎలాంటి వేధింపులు ఉండవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం కల్పిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ని అగ్రగామిగా నిలిపే దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక మైలురాయి అని చెప్పారు. శనివారం కాకినాడలోని వాకలపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ తో కలసి ఏఎం గ్రీన్ సంస్థ వారి గ్రీన్ అమ్మోనియా-గ్రీన్ హైడ్రోజన్ కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేశారు. గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించారు.

3




# సీపీఐ వందేళ్ల విశిష్ట ప్రస్థానం

- కూనంనేని సాంబశివరావు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి



ఎన్నో కుట్రలు, నిర్బంధాలు, ఉరికొయ్యలను ఛేదించి చెరసాలల్లో పురుడుపోసుకొని భారతగడ్డపై నూరేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రగతిశీల రాజకీయశక్తి భారత కమ్యూనిస్టు పార్టీ. ఈ జయాపజయాల ప్రస్థానం 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ప్రారంభమయింది. కమ్యూనిస్టుల పురిటిగడ్డ అయిన ఖమ్మం పట్టణంలో ఈ నెల 18న శత వసంతాల వేడుకలను నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ వేడుకలలో 10వేల మంది అరుణ సైన్యం కవాతు చేయబోతోంది. బహిరంగసభకు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరుకానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సౌహార్ద సందేశం ఇవ్వనున్నారు. 20న నిర్వహించే సెమినార్‌కు డి.రాజాతో పాటు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వార్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరుకానున్నారు.

2



# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో విజయసాయి రెడ్డికి ఈడీ నోటీసులు

- సిట్ ఇప్పటికే సేకరించిన కీలక పత్రాలు, సాక్ష్యాల ఆధారంగా విచారణను వేగవంతం చేసిన ఈడీ

ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22న ఢిల్లీ లేదా హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు రాజకీయ నేతలు, అధికారుల పేర్లు వెలుగులోకి రాగా, తాజాగా విజయసాయి రెడ్డికి నోటీసులు అందడం చర్చనీయాంశమైంది. మద్యం సరఫరాదారులు, డిస్టిలరీల నుంచి భారీ మొత్తంలో ముడుపులు స్వీకరించి, ఆ డబ్బును హవాలా మార్గంలో ఇతర రాష్ట్రాలు లేదా విదేశాలకు తరలించినట్లు అభియోగాలున్న నేపథ్యంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఇప్పటికే సేకరించిన కీలక పత్రాలు, సాక్ష్యాల ఆధారంగా ఈడీ విచారణను మరింత వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.

# తుమ్మల చెరువు షాది ఖానా నిర్మాణం పూర్తి అయ్యేది ఎప్పుడు..?

**- డాక్టర్ షేక్ మహబూబ్ వలి**

మార్కాపురం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : తుమ్మల చెరువు గ్రామం తర్లుపాడు మండలం మార్కాపురం జిల్లా తర్లుపాడు మండలంలో అత్యధిక మైనారిటీ ముస్లిం సోదరులు ఉంటున్న గ్రామం తుమ్మలచెరువు.

ఇక్కడ ఉండే మైనార్టీ సోదరులు తమ రోజువారి కూలీ పనుల చేసుకొని తమ జీవనం గడుపుతున్నారు. తుమ్మలచెరువు గ్రామ వాసులు ఒక దశాబ్దం పైగా ఈ షాది ఖానా నిర్మాణం పనులు ఎప్పుడు పూర్తి అవుతుందని ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్న షాది ఖాన్ నిర్మాణ పనులు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంటుందని, ఇంతవరకు నిర్మాణ పనులు పూర్తి కాలేదన్నారు. ఈ షాది ఖానా ఆవరణలో ముల్లకంపలతో చెత్తాచెదారంతో నిండి ఉంది. కావున ప్రభుత్వం మైనారిటీలకు తాము అండగా ఉంటున్నాం అని చెప్పడమే కాకుండా, ఈ షాది ఖానా నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి అన్నారు. అనంతరం డాక్టర్ షేక్ మహబూబ్ వలి తర్లపాడు మండల డిప్యూటీ యంపిపిడిఓకి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, తుమ్మలచెరువు గ్రామ పెద్దలు సయ్యద్ అమీర్, సయ్యద్ గౌస్, షేక్ షఫీ మరియు అనేకమంది తుమ్మలచెరువు గ్రామ వాసులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అబ్దుల్, కార్యకర్తలు పాల్గొన్నారు.








# "బాలోత్సవం" గేయం

– సాకీ
ఓ ఓ ఓ ఓ ఓ ఓ   ఆ ఆ ఆ ఆ ఆ ఆ

పల్లవి
బాలోత్సవం ఇది బాలోత్సవం
బాలల భవిత తెల్పు సృజనోత్సవం
స్వచ్ఛమైన మనసున్న బాలల దివ్యోత్సవం
కలికల్మష మెరుగని బాలల భవ్యోత్సవం

చరణం 1

బాల మిత్రులకు బుజ్జాయిలకు స్వాగతమిదే
మీ ఆట పాటలకు వేదికై నిలిచిందీ నడిచిందీ
తణుకు తణుకు శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రము
పలుకుతున్నదీ మీకు హృదయాంతర ఆహ్వానము

బాలోత్సవం ఇది బాలోత్సవం
బాలల భవిత తెల్పు సృజనోత్సవం
స్వచ్ఛమైన మనసున్న బాలల దివ్యోత్సవం
కలికల్మష మెరుగని బాలల భవ్యోత్సవం

చరణం 2

తియ్యనదీ మరపురానిదీ మరువలేనిదీ తిరిగిరానిదీ ఈ బాల్యం
ఆట పాటలకు కోతి చేష్టలకు ఆలవాలమే ఆ బాల్యం
కష్ట సుఖాలు తెలియనిదీ బాదరబందీ లేనిదీ బంగరు బాల్యం
కాల గమనం తెలియనిదీ కాలం విలువ తెలియనిదీ ఈ బాల్యం

బాలోత్సవం ఇది బాలోత్సవం
బాలల భవిత తెల్పు సృజనోత్సవం
స్వచ్ఛమైన మనసున్న బాలల దివ్యోత్సవం
కలికల్మష మెరుగని బాలల భవ్యోత్సవం

చరణం 3

దేశ భక్తి పాటలు పాడుదాం ఉల్లాసమైన ఆటలు ఆడుదాం
ఏక పాత్రలు వేద్దాం నాటకాలు నాటికలు ఆడుదాం
చిత్రలేఖనంలో చతురత చూపిద్దాం వ్యాస రచనలు రాసేద్దాం
గలగలా మాటాడుదాం మాటలతో పాటలతో మెప్పిద్దాం

బాలోత్సవం ఇది బాలోత్సవం
బాలల భవిత తెల్పు సృజనోత్సవం
స్వచ్ఛమైన మనసున్న బాలల దివ్యోత్సవం
కలికల్మష మెరుగని బాలల భవ్యోత్సవం

చరణం 4

కుల మతాల భేదమేలేని సమాజమే లక్ష్యమై
కర్షక కార్మిక పక్షమై విద్యార్థుల భవితే నిత్యమై సత్యమై
యువతీ యువకుల మహిళామూర్తుల నైపుణ్యాభివృద్ధే గమ్యమై
యువజనుల నవ యవ్వనుల సన్మార్గమే నీదు శపథమై
యువ జనుల పుర జనుల చైతన్యమే నీదు పథమై
సమాజ శ్రేయస్సే నీదు హితమై మతమై నడచు
తణుకు శ్రీ శ్రీ సేవా విజ్ఞాన కేంద్రమా నిలువుమా ఆచంద్ర తారార్కమూ
అంబరాన ఇంద్ర ధనుస్సువోలె సంబరాలు చేయు సంస్థగా
వర్ధిల్లుమా శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రమా

బాలోత్సవం ఇది బాలోత్సవం
బాలల భవిత తెల్పు సృజనోత్సవం
స్వచ్ఛమైన మనసున్న బాలల దివ్యోత్సవం
కలికల్మష మెరుగని బాలల భవ్యోత్సవం



- గేయ రచయిత : కోట రామ ప్రసాద్, రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు, టీవీ & సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్. పాలంగి గ్రామం & (గ్రా.వా.)ూxచీ : 534 216, తణుకు పట్టణం వద్ద, ఉండ్రాజవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం. వాట్స్ ఆప్ నెంబర్ : 93475 03536, జీఅశీ ఫోన్ నెంబర్ : 89195 72779.

# సీపీఐ వందేళ్ల విశిష్ట ప్రస్థానం

**- సీపీఐ పుట్టుకే శ్రామిక**

అంతర్జాతీయత, దేశభక్తితో మిళితమై ఉంది. వివిధ శ్రేణులుగా ఉన్న దేశభక్తులను, స్వాతంత్ర్య సమరయోధులను కమ్యూనిజం వైపు తీసుకువచ్చింది. భారతదేశంలో ఉన్న జాతీయ విప్లవకారులు, జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పనిచేస్తున్న సోషలిస్టు కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది, అతివాదపక్షం, టెర్రరిస్టు సంస్థలు, ఖిలాఫత్ ఉద్యమ నాయకులు, గదర్ పార్టీ నాయకులు సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు. 192122లో శాసనోల్లంఘన ఉద్యమం విఫలమైన తర్వాత గాంధీజీ ప్రతిఘటన సిద్ధాంతం పట్ల భ్రమలు కోల్పోయిన వ్యక్తులు, గ్రూపులు కూడా అక్టోబర్ విప్లవ ప్రభావంతో శాస్త్రీయ సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు. ఆ తర్వాత వీరే దేశంలో తొలి కమ్యూనిస్టు గ్రూపుల స్థాపకులయ్యారు. బొంబాయిలో డాంగే, మద్రాసులో సింగార్‌వేల్ సెట్టియార్, కలకత్తాలో ముజఫర్ అహ్మద్, లాహోర్‌లో ఇంక్విలాబ్ గ్రూపులకు చెందిన గులాం హుస్సేన్ తదితరుల కలయికతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటయింది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో, రైతాంగ పోరాటాలలో, స్వదేశీ సంస్థానాల్లో, విముక్తి పోరాటాల్లో, సంఘ సంస్కరణలు, సామాజిక మార్పుల కోసం జరిగిన పోరాటాల్లో ఇంకా అనేక రీతుల్లో జరిగిన భారత ప్రజల విప్లవ ఉద్యమంలో పాల్గొన్న వారిలో అధికులు కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రమాదకరంగా భావించిన బ్రిటిష్ ప్రభుత్వం 1934 జూలైలో పార్టీని నిషేధించింది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులందరూ కాంగ్రెస్‌లోనే ఉండి పనిచేసి దేశ స్వాతంత్ర్యం కొరకు ద్విగుణీకృత పోరాటాలు నడిపారు. కాంగ్రెస్‌లోనే అంతర్భాగంగా సోషలిస్టు కాంగ్రెస్ పార్టీని 193234 ఏర్పాటు చేసుకున్నారు. అంతిమంగా సోషలిస్టు కాంగ్రెస్‌లోని కమ్యూనిస్టులతో పాటు మరెంతో మంది అభివృద్ధి కాముకులు అక్టోబర్ విప్లవ ప్రభావంతో కాంగ్రెస్‌లోనే వామపక్ష గ్రూపుగా ఏర్పడ్డారు. తదనంతరం అనేక మంది సోషలిస్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వీరిలో ఈఎంఎస్ నంబూద్రిపాద్, చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, ఎ.కె.గోపాలన్, కంభంపాటి సీనియర్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రముఖులు. ఒకనాటి అస్సాం రాష్ట్రం ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న చాబర్ సిల్‌హెట్ జిల్లాలోని లోయ ప్రాంతంలో వీరోచిత కౌలురైతుల పోరాటాలు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగాయి. ఆ పోరాటవీరులు అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా వర్లీ తెగకు చెందిన ఆదివాసీలు తిరుగుబాటు చేశారు. 1946లో రాయల్ ఇండియన్ నావీ తిరుగుబాటుదారులు కమ్యూనిస్టు పార్టీ జెండాను చేతబూనారు. 194651 మధ్య జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించబడింది. మూడు వేల గ్రామాల విముక్తి, 10లక్షల ఎకరాల భూమి రైతాంగానికి పంపిణీ, వెట్టిచాకిరి రద్దు లాంటి అనేక విజయాలు ఈ పోరాటంలో సాధించారు. ప్రధానంగా నిజాం నవాబు లొంగిపోవడం, హైదరాబాద్ రాష్ట్రం భారత్‌లో విలీనం, సాయుధ పోరాట ప్రభావంతోనే జరిగాయి. విలీనం తర్వాత భారత సైన్యం, పోలీసులు కమ్యూనిస్టులపై దాడులకు పాల్పడటంతో జరిగిన రైతాంగ గెరిల్లా పోరాటంలో 4000 మందికి పైగా కమ్యూనిస్టులు మృతిచెందారు. 10వేల మందిని డిటెన్షన్ క్యాంపుల్లో పెట్టి మూడు, నాలుగు సంవత్సరాల పాటు చిత్రహింసలకు గురిచేశారు. మహిళలతో నగ్నంగా బతుకమ్మలాడించారు. అన్ని నిర్బంధాలను తట్టుకొని నిలబడటమే కాకుండా 1952లో జరిగిన ఎన్నికల్లో అటు మద్రాస్ రాష్ట్రంలోనూ, ఇటు హైద్రాబాద్‌లోని తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టులు కాంగ్రెస్ కంటే అధిక స్థానాలు సాధించారు. కమ్యూనిస్టుల ఉద్యమ ప్రభావం రాజ్యాంగ పీఠికలో స్పష్టంగా కనిపించింది. దున్నేవాడికే భూమి నినాదంతో జమిందారీ, జాగిర్దారీ పాలనకు వ్యతిరేకంగా రైతు కూలీలను సమీకరించారు. భూ సమస్యను ఎజెండా మీదకు తెచ్చారు. కార్మికులు, కర్షకులతో పాటు మహిళలు, దళితులు, ఆదివాసీలు స్వాతంత్ర్యోద్యమంలోకి వచ్చారు. మహిళా హక్కులు, కుల నిర్మూలన, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమించింది. మహిళా సమానత్వ హక్కును ఎజెండాలోకి తెచ్చింది. యువతను విద్యా, వైజ్ఞానిక సేవా సాంస్కృతిక కార్యక్రమాల్లో సమీకరించింది. ఏఐటీయూసీ, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత విద్యార్థి సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ), అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా), తెలుగు రాష్ట్రాల్లో ప్రజానాట్యమండలి ఏర్పాటయ్యాయి. అలాగే బ్యాంకు ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు, పాత్రికేయులకు, బొగ్గు గని కార్మికులకు, రవాణా కార్మికులకు, ఆయా రంగాల్లో వివిధ కార్మిక సంఘాలను ఏర్పాటు చేశారు. దేశంలో కమ్యూనిజం ఆవశ్యకత, అవసరం ఎన్నడూలేని విధంగా నేడు ఉన్నది. ఉద్యోగ భద్రత లేదు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పేరుతో అతి తక్కువ వేతనాలతో కొత్తరూపంలో శ్రమదోపిడి జరుగుతున్నది. భావాన్ని, ప్రశ్నించేవారిని అణచివేస్తున్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు. కవులు, కళాకారులను మతోన్మాద అరాచకులు కాల్చి చంపుతున్నారు. సోషల్ మీడియాను ఒక యూనివర్శిటీగా మల్చుకొని విద్రోహపూరిత విషజ్వాలలను సమాజంలో విరజిమ్ముతున్నారు. ఆర్థిక అసమానతలు ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. 4వ ఆర్థిక వ్యవస్థగా చెప్పబడుతున్నా, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైంది. అలీన విధానాన్ని గాలికి వదిలేసి అమెరికా ఆదేశాలను పాటించే స్థితికి దేశ పాలకులు వచ్చారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్సు రంగాలను సరళీకరణ పేరుతో విదేశీ, కార్పొరేట్ శక్తులకు స్వాధీనం చేస్తున్నారు. బొగ్గగనులు, ఉక్కు కర్మాగారాలు, రైల్వే వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, ఆఖరికి అణుశక్తిలాంటి వ్యవస్థల్లో విదేశీయులను పెట్టుబడుల పేరుతో అనుమతిస్తున్నారు. ఈ దశలో ప్రజలు కమ్యూనిస్టు వ్యవస్థను కోరుకుంటున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థ మాత్రమే. మనిషి కేంద్రంగా పుట్టిన సిద్ధాంతమే కమ్యూనిస్టు సిద్ధాంతం. మనిషి ఉన్నంతకాలం, మనిషిలో ఆలోచనలు, భావాలు, ప్రశ్నలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుంది. సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం కొనసాగుతుంది. కమ్యూనిస్టుల విలీనం దేశానికి, దేశ ప్రయోజనాలకు ఒక దిక్సూచి.

## ఇన్సులిన్‌ను పెంచని 'సహజ చక్కెర'...

# శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ

**- మధుమేహులకు వరంగా మారనున్న 'టాగటోజ్' చక్కెర- రక్తంలో ఇన్సులిన్, గ్లూకోజ్ స్థాయిలను పెంచని ప్రత్యేకత**

**- సాధారణ చక్కెరతో సమానమైన రుచి, కానీ కేలరీలు చాలా తక్కువ- తక్కువ ఖర్చుతో టాగటోజ్ తయారుచేసే పద్ధతి ఆవిష్కరణ**

**- భవిష్యత్తులో స్వీట్లు, శీతల పానీయాల్లో వినియోగానికి అవకాశం**

సింహగర్జన, ఆరోగ్యం, జనవరి 17 : మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి శాస్త్రవేత్తలు ఒక తీపి కబురు అందించారు. సాధారణ చక్కెర మాదిరిగానే రుచిగా ఉంటూ, రక్తంలో గ్లూకోజ్ లేదా ఇన్సులిన్ స్థాయిలను పెంచని ఒక సహజమైన చక్కెరను సులభంగా తయారు చేసే పద్ధతిని కనుగొన్నారు. 'టాగటోజ్' అని పిలిచే ఈ చక్కెర, ఆహార పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని నిపుణులు భావిస్తున్నారు.

**- ఏమిటీ టాగటోజ్ ప్రత్యేకత?**

టాగటోజ్ అనేది పండ్లు, పాల ఉత్పత్తుల్లో చాలా స్వల్ప పరిమాణంలో లభించే ఒక సహజ చక్కెర. దీని రుచి మనం వాడే పంచదారకు దాదాపు 90 శాతం సమానంగా ఉంటుంది. కానీ కేలరీల విషయంలో మాత్రం కేవలం 40 శాతం మాత్రమే కలిగి ఉంటుంది. ముఖ్యంగా దీన్ని తీసుకున్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగవు. దీంతోపాటు దంత క్షయానికి కూడా కారణం కాదు. ఈ లక్షణాలన్నీ టాగటోజ్ ను ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా నిలుపుతున్నాయి.

**- తక్కువ ఖర్చుతో తయారీ**

ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, టాగటోజ్ ను సహజంగా వేరుచేయడం చాలా ఖరీదైన ప్రక్రియగా ఉండేది. అయితే తాజా పరిశోధనలో శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించారు. పాలలో ఉండే 'గెలాక్టోజ్' అనే చక్కెరను, కొన్ని ప్రత్యేక ఎంజైమ్‌ల సహాయంతో తక్కువ ఖర్చుతో టాగటోజ్ గా మార్చే విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ ఆవిష్కరణతో భవిష్యత్తులో ఈ ఆరోగ్యకరమైన చక్కెరను తక్కువ ధరకే మార్కెట్లోకి తెచ్చేందుకు మార్గం సుగమమైంది. ఈ నూతన



ఆవిష్కరణ ఆహార, శీతల పానీయాల పరిశ్రమలపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. చక్కెర వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను నివారిస్తూనే, రుచిలో రాజీ పడకుండా తీపి పదార్థాలను ఆస్వాదించే వీలు కలుగుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అగ్నిపూలు



రచన : పోలగాని భాను తేజశ్రీ

అగ్నిపూలు పూచాయి ఎదలోతుల్లో
అద్వైతం అక్షువులకు సంయుక్తమైన క్షణాన

కనులను కమ్మేసిన అడ్డుతెరలు
ఒక్కొక్కటి వీడిపోతున్నాయి...
వికసించిన నా హృదయము
ఈశ్వరుని చూసి ఉప్పొంగిన క్షణాన

ఉషస్సులన్నీ విజృంభించి నాపై దండయాత్రకు
దిగాయి
దైనందిన జీవితపు అడ్డు రేఖలు అశ్రువులు
చీల్చుకుని మరీ
అంధకార బాణాలు నాపై విసిరిన క్షణాన

ఆగాలని లేదు నా ఆశకు
ఆపాలని లేదు ఈ శ్వాసను

ఆరాధన అనే ఆలోచనే లేదు
ఆగక సాగాలని రుధిరం పరవళ్ళు తొక్కుతుంది
ఆవేశాన్ని అణువణువు నింపుకుని
కదులుతున్నా

ఇతరుల దృక్కోణమేదైనా

నే నడిచే తోవలో ఎదురయ్యే
అడ్డు గోడలను కూకటి వేళ్లతో
పెకిలించాల్సింది నేనే
పరిణితి పెంచుకొని ప్రత్యామ్నాయలను
జయించాల్సింది నేనే
ఉప్పొంగే గంగనై విజృంభించి విళయ
తాండవం చేయాల్సిందే నేనే
రాక్షసమూఖ రేపే పుకార్లను ధీరత్వంతో
వధించాల్సింది నేనే...

## పరివ్రాజక పరాగం



-మౌనశ్రీ మల్లిక్
8919338546

నేను జీవితంలో
సాధించిందేంటని ఆలోచిస్తే
మిగిలింది శూన్యమే అనిపిస్తుంది

నడక నేర్చినప్పటి
ఈ పరుగు ఎక్కడికో
ఇప్పటికీ అర్థం కాలేదు
ఇప్పుడర్థమైనా ప్రయోజనం లేదు
జీవిత పరమార్థం తెలియక
జీవించడం కంటే
మూర్ఖత్వం మరొకటి లేనేలేదు

నా అనుకున్న వారితో
ఎంత సమయం గడిపాను
అసలైన ఆనందాన్ని కాదని
భ్రమలో కరిగిన కాలాన్ని
ఇప్పుడెలా తెచ్చుకోను
యాంత్రికతలో కోల్పోయిన
ఆత్మీయతనెలా కూడగట్టుకోను

వేలసార్లు మనసెంతగా
వారించినా వింటే కదా
శిఖరాలు అధిరోహించాను
నా దేహాన్ని మోసిన
మట్టి రేణువులను మరిచాను

ధనానికి దగ్గరై
మనుషులకు దూరమయ్యాను
గర్వానికి బానిసై
మానవతను కోల్పోయాను

మిగిలిన గుప్పెడు కాలంలో
చీమలబారుల్లో ఒక చీమగా
పూలవనంలో ఒక గడ్డి పువ్వుగా
తనువు తన్మయధూళిగా మారి
ప్రణవంలో పరివ్యాప్తమవ్వాలి

ఈ గొంగళిపురుగు దేహం
కాసేపైనా సీతాకోకచిలుకై
వినువీధుల్లో విహరించాలి
పడమట సంధ్యారాగంలో
పరివ్రాజక పరాగమై పరిమళించాలి
నిష్క్రమణకు ముందు
కొన్ని ఘడియలైనా సంచారినై
జన్మకు సార్థకతను పాడుతూ
ప్రకృతిలో ఐక్యమైపోవాలి.

# రేపల్లె పోలీస్ స్టేషన్ లో వుమన్ స్టేషన్ ఇన్స్పెక్టర్గా వెంకట శ్రీ రాజ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరణ

రేపల్లె
బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఉత్తర్వుల మేరకు స్టేషన్ ఇన్స్పెక్టర్ గా డి వెంకట శ్రీ రాజ్యలక్ష్మి రేపల్లె పోలీస్ స్టేషన్ లో సీఐ మల్లిఖార్జునరావు కి రిపోర్ట్ చేసి భాధ్యతలు చేపట్టారు...



# ముక్కనుమతో ముగిసిన సంక్రాంతి సంబరాలు

తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : తాళ్ళరేవు మండలం సుంకర పాలెం బాబా నగర్ లో సిద్ధార్థ స్టూడెంట్స్ అండ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, స్పూన్ అండ్ లెమన్, టగ్ ఆఫ్ వార్, మరియు విద్యార్థిని విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులను విద్యార్థులను ఉద్దేశించి సంక్రాంతి పండగ తెలుగువారికి అత్యంత ముఖ్యమైన పండుగని ఇది రైతులు వ్యవసాయ కార్మికులు అన్ని వర్గాల ప్రజలు కలిపి జరుపుకునే పండుగని సభాధ్యక్షుడు డాక్టర్ కాశి రామారావు అన్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని శ్రద్ధగా చదివించాలని, విద్యార్థులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని స్ఫూర్తిగా తీసుకుని, బాగా చదవాలని అందరూ ఐకమత్యంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వడ్డీ అబ్బులు, మొసలి అప్పారావు కాశి లక్ష్మణస్వామి, కుసుమ శ్రీనివాస్, నాగబత్తుల బాలకృష్ణ, కాశి శ్రీనివాస్, వాకపల్లి శ్రీనివాస్ యూత్ ప్రెసిడెంట్ వడ్డీ అంబేద్కర్, మురళి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కృష్ణ తేజ, రాంజీ, సత్తిబాబు, దుర్గాప్రసాద్, సామ్యూల్, ఆమోస్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు పెద్దల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.








## కొత్త అల్లుడికి 160 వంటకాలతో విందు

తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామంలో "పాలూరి" వారి కొత్త అల్లుడు ఆకుల రామకృష్ణ, కుమార్తె మాధురి సంక్రాంతి పండుగకు వచ్చిన సందర్భంగా అత్త మామ తిరుమల తనూజ, భీమేశ్వరరావు, బావమరిది మహేష్ ల ఆధ్వర్యంలో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ విందు సందర్భంగా 160 రకాల వంటలతో ఏర్పాటు చేసి, అల్లుడి మీద అభిమానం చాటుకున్నారు. పూర్వం పెళ్లిళ్లలో వివాహ భోజనం వింతైన వంటకం అంటూ అనేవారు. మరల నేటి తరం ఈ సాంప్రదాయాలు కొనసాగించడం అభినందనీయం అని రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ ధూళిపూడి సుబ్బారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, రమా, అర్చన, పాలూరి రామకృష్ణ కుటుంబ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన దంపతులను ముత్తైదువలు ఆశీర్వదించి నిండు నూరేళ్లు సుఖశాంతులతో ఉండాలని దీవించారు. వచ్చిన ప్రజలను పాలూరి కుటుంబ సభ్యులు సత్కరించారు

# కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపుతుంది

ప్లాంట్ నమూనాని పరిశీలించి. యంత్ర పరికరాల పైలాన్ ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం అని గ్రీన్ కో వ్యవస్థాపకుడు చలమలశెట్టి అనిల్ నిరూపించారు. అనేక కష్టనష్టాలను తట్టుకుని ఈ రోజున ఏఎం గ్రీన్ కంపెనీ స్థాపించారు. కాకినాడలో 495 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.15, 600 కోట్లు పెట్టుబడితో ప్రారంభం అవుతున్న ఈ సంస్థలో 8 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పాదక ఇంధన పెట్టుబడులు రానున్నాయి. 2027 ఏడాది చివరికి తొలి దశ కమిషనింగ్ లక్ష్యంగా, పునరుత్పాదక ఇంధన ఆధారిత శుద్ధ ఇంధన కేంద్రంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోబోతోంది. నిర్మాణ దశలో సుమారు 8,000 మందికి, ఆపరేషన్ దశలో సుమారు 1,500 మందికి ప్రత్యక్ష ఉపాధి, పరోక్షంగా కొన్ని వేల మందికి దీర్ఘకాల ఉపాధి అవకాశాలు సృష్టించే ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వ్యవస్థాపకుడు అయిన చలమలశెట్టి అనిల్, మహేష్ లకు అభినందనలు తెలియజేస్తున్నాను.

**- క్లీన్ ఎనర్జీ పాలసీతో విధానపరమైన స్పష్టత ఇచ్చాం**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుంది. ఆ ప్రయత్నాల్లో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక అడుగు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. అందుకు ఏఎం గ్రీన్ ఎనర్జీ ముందుకు రావడం ఆనందందాయకం. ఆ దిశగా కూటమి ప్రభుత్వం వేసిన బలమైన అడుగు ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024. ఈ పాలసీ రాష్ట్రాన్ని భవిష్యత్ పునరుత్పాదక ఇంధన సామర్థ్య కేంద్రంగా, పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి హబ్‌గా తీర్చిదిద్దబోతోంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా వంటి శుద్ధ ఇంధనాల ఉత్పత్తికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించగలిగితే పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతుంది. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా ఇప్పటికే కూటమి ప్రభుత్వం విధానపరమైన స్పష్టత ఇచ్చింది. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం కావాలి. అదే నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానం. క్లీన్ ఎనర్జీ పాలసీని సద్వినియోగం చేసుకుంటూ ఈ రోజు ఏఎం గ్రీన్ సంస్థ మన కాకినాడలో దేశంలోనే మొట్టమొదటి మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దేశ కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో చారిత్రక మైలురాయిగా అభివర్ణించవచ్చు.

**గ్రీన్ అమ్మోనియా రాష్ట్ర సుస్థిర అభివృద్ధి సాధనలో బలమైన అడుగు**

ఈ ప్రాజెక్టు పునరుత్పాదక ఇంధన సాయంతో నీటిని ఎలక్ట్రాలిసిస్ చేయడం ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రక్రియలో వాతావరణంలోని కర్బన ఉద్గారాలను పూర్తిగా క్లీన్ చేస్తుంది. పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కీలక అడుగు. ఏఎం గ్రీన్ సంస్థ ఏడాదికి 0.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా సరఫరా చేసేందుకు జర్మనీకి చెందిన ప్రముఖ ఇంధన సంస్థ యూనిపర్ తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారత దేశం నుంచి యూరోపియన్ దేశాలకు జరుగుతున్న తొలి శుద్ధ ఇంధన ఎగుమతి ఒప్పందం. ఈ చారిత్రాత్మక ఒప్పందానికి ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా ఉండడ మనందరికీ గర్వకారణం. గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు దేశ, రాష్ట్ర సుస్థిర అభివృద్ధి సాధనలో బలమైన అడుగు. వ్యవసాయం నుంచి రవాణా వరకు అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు ఇది ఉపయోగపడుతుంది. రవాణా, పారిశ్రామిక, జల రవాణా రంగాల్లో క్రూడ్ ఆయిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఎరువుల తయారీ, విత్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగాల్లో కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది. క్రూడ్ ఆయిల్ ప్రమేయం లేకుండా ఎరువులు తయారు చేయడం, ఫార్మా, రసాయిన, ప్లాస్టిక్ ఆధారిత పరిశ్రమల్లో ముడి పదార్థంగా గ్రీన్ అమ్మోనియా ఉపయోగపడుతుంది. వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా వాతావరణంలో మార్పులను నిలవరించవచ్చు. ఒక్క సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతను తగ్గించినా బలమైన మార్పు వస్తుంది. ఉప్పాడలో సముద్ర జలాలు ముందుకు వచ్చేస్తున్నాయంటే అందుకు భూతాపం పెరగడమే కారణం. ఇలాంటివి తగ్గించేందుకు ప్రపంచ దేశాలన్నీ క్రూడ్ ఆయిల్ ప్రమేయంలేని గ్రీన్ ఎనర్జీ తయారికీ పెద్దపీట వేస్తున్నాయి.



**- గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది**

గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి ఎన్నో దీర్ఘకాలిక లాభాలు కలగనున్నాయి. ఇది రాష్ట్రాన్ని విద్యుత్ రంగ సంక్షోభం నుంచి బయటపడేస్తుంది. పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపుతుంది. గత ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు రద్దు చేసి, పునః సమీక్ష పేరిట విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసింది. కియా లాంటి సంస్థ ప్రతినిధులపై కూడా బహిరంగ బెదిరింపులకు దిగారు. కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో పెట్టుబడిదారులకు సహకరిస్తూ.. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, కాకినాడ జిల్లా ఉన్నతాధికారులు, ఏఎం గ్రీన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.




## సత్యదేవుని నిత్యాన్నదాన ప్రధకానికి రూ.1,00,116/- విరాళం




అన్నవరశీ, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి అనంతపురంకు చెందిన కలవల గౌతమ్, జయశ్రీ దంపతులు రూ.1,00,116లు విరాళమును దేవస్థానం ఆలయ పిఆర్ఓ అనకాపల్లి ప్రసాద్ కి అందజేసి, ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో అక్టోబర్ 17వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా దాతలను ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాంజీ పాల్గొన్నారు.

## సత్యదేవుని నిత్యాన్నదాన పధకానికి రూ. 1,00,116/- విరాళం




అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన బొమ్మన ఈశ్వరరావు రూ.1,00,116లు విరాళమును దేవస్థానం ఆలయ పిఆర్ఓ అనకాపల్లి ప్రసాద్ కి అందజేసి, ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో మార్చి 1వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా దాతలను ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాంజీ పాల్గొన్నారు

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి.

ఝరాసంగం)
క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని యువకులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని ఝరాసంగం ఎస్ ఐ క్రాంతి కుమార్ పాటిల్, ఎల్గోయి మాజీ సర్పంచ్ ఓం ప్రకాష్ పాటిల్ శుక్రవారం ఎల్గోయి గ్రామ ప్రీమియర్ లీగ్2.2026 క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్న మెంట్ లో మొత్తం ఎల్గోయి మరియు మ చూనూర్ జట్లు పాల్గొని తలపడగా అందులో విన్నర్ గా ఎల్గోయి గ్రామానికి చెందిన విక్టర్ వింగ్స్ వారి జట్టు గెలుపొందారు. ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల పోటీలలో గెలుపోటములు సహజమని ఓటమి చెందిన వారు నిరుత్సాహపడక ఓటమి గెలుపుకు నాందిగా భావించాలన్నారు. అన్నారు ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందించారు





## లైన్స్ క్లబ్ ఆఫ్ సత్యదేవ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు

అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : లైన్స్ క్లబ్ ఆఫ్ సత్యదేవ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భముగా అన్నవరం బీసీ కాలనీ నందు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు న్యాయ నిర్ణేతలుగా పర్వత జానకి, రామిశెట్టి కామాక్షి వ్యవహరించారు. ఈ ముగ్గుల పోటీ వల్ల కాలనీలో సంక్రాంతి శోభ మరింతగా ఇనుమడించిందని కాలనీ సభ్యులు లయన్స్ వారిని కొనియాడారు. ఈ ముగ్గుల పోటీలో మొదటి బహుమతి రాయవరపు సుప్రజ, రెండవ బహుమతి కొత్తూరు శ్రావణి, మూడవ బహుమతి ఉప్పలపు శ్రీదేవి గెలుపొందారు. ఈ ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతి ప్రధానం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అడపా సత్తి బాబు, సెక్రటరీ పొన్నాడ సూరిబాబు, కార్యదర్శి బుడ్డిగ వాసు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ సభ్యులు డొంకాడ గిరి, మచ్చా నాగేశ్వరరావు, సత్యనారాయణ, దోమాడ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి చేయూతనందించినటువంటి అందరికీ గిరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వాట్సాప్ గ్రూప్‌ల నిర్వహణకు మెటా కొత్త ఫీచర్లు



సింహగర్జన, ఇంటర్నెట్ డెస్క్, జనవరి 17 : మెటా సంస్థ వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యుల నిర్వహణను సులభతరం చేయడానికి మూడు కొత్త ఫీచర్లను విడుదల చేసింది. 'మెంబర్ ట్యాగ్స్' ద్వారా సభ్యులకు కస్టమ్ పేర్లు, రోల్స్ ఇవ్వవచ్చు, 'టెక్స్ట్ స్టిక్కర్స్' ద్వారా టైప్ చేసిన పదాలను స్టిక్కర్లుగా మార్చవచ్చు, 'ఈవెంట్ రిమైండర్స్' ద్వారా గ్రూప్ ఈవెంట్లకు ముందుగానే అలర్ట్స్ సెట్ చేసుకోవచ్చు. ఈ అప్‌డేట్లు 1024 మంది సభ్యులున్న పెద్ద గ్రూప్‌లలో కమ్యూనికేషన్‌ను మరింత సమర్థవంతంగా చేస్తాయి. 2జీబీ ఫైల్ షేరింగ్, హెచ్‌డీ మీడియా, స్క్రీన్ షేరింగ్ వంటి ఫీచర్లతో పాటు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ భద్రతను అందిస్తుంది.

# తెలుగు భాషకు, సంస్కృతికి వన్నె తెచ్చిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు

**- ప్రజల మనోభావాలను అనుసరించే ఏ నాయకుడైనా పనిచేయాలి - మహానుభావులకు కులం, జాతి, మతం వర్తించవు**


**- శ్రీ కృష్ణదేవరాయల జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : ఆంధ్రభోజ బిరుదాంకితుడు, విజయనగర చక్రవర్తి, సాహితీ సమరాంగణ సార్వభౌమ, కళలకు, సాహిత్యానికి, తెలుగుభాషకు పెద్ద పీట వేసిన చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు, 9వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ పాల్గొని శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పౌరుష ప్రతాపాలకు శ్రీకృష్ణదేవరాయలు ప్రతీక అన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని తెలుగు ఘనతను చాటిన ధీరోదాత్తుడని కొనియాడారు. ఆయన పాలనలో వీధుల్లో రత్నాలు రాశులుగా పోసి అమ్మేవారని అన్నారు. భువన విజయం నిర్వహించి అష్టదిగ్గజాలనే కవులను పోషించిన మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు కీర్తి తెలుగు జాతి ఉన్నంతవరకు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మహాకవి ధూర్జటి, తెనాలి రామకృష్ణ వంటి కవులు ఆయన పోషణలో తెలుగు భాషకు ఎంతో సేవ చేశారని కీర్తించారు. అటువంటి మహనీయుని గౌరవించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. మహానుభావులకు కులం, జాతి, మతం వర్తించవని తెలిపారు. ప్రజల మనోభావాలు, ప్రజల అభీష్టాలను అనుసరించే ఏ నాయకుడైనా పనిచేయాలని ఆయన అన్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పనిచేసే వారు చరిత్ర హీనులవుతారు. కృష్ణదేవరాయలను అవమానించడం అంటే తెలుగు భాషను అవమానించడమేనని అన్నారు. తెలుగు భాష, సంస్కృతుల గౌరవం పెరిగేలా కృష్ణదేవరాయలను గౌరవించుకుంటామని తెలిపారు.



# తెలుగు సినిమా స్థాయిని పెంచిన చిత్రం 'గోవింద గోవింద'

అక్కినేని నాగార్జున నటించిన అత్యంత ప్రయోగాత్మకమైన మరియు స్టైలిష్ సినిమాల్లో 'గోవింద గోవింద' ఒకటి. దర్శకత్వం: రామ్ గోపాల్ వర్మ చేసారు. ఈ సినిమా కథ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం చుట్టూ తిరుగుతుంది. ఒక అంతర్జాతీయ స్మగ్లర్ (పరేష్ రావల్) మరియు ఒక క్షుద్ర మాంత్రికుడు కలిసి తిరుపతి శ్రీవారి కిరీటాన్ని దొంగిలించడానికి ప్లాన్ చేస్తారు. ఆ కిరీటం ద్వారా అపారమైన శక్తులు పొందాలని మాంత్రికుడు ఆశిస్తాడు. ఈ దొంగతనంలో ఆలయ సెక్యూరిటీ గార్డు (నాగార్జున తండ్రి) అన్యాయంగా ఇరుక్కుంటాడు. తన తండ్రిపై పడ్డ నిందను పోగొట్టడానికి, పోయిన కిరీటాన్ని తిరిగి తీసుకురావడానికి హీరో (నాగార్జున) బ్యాంకాక్ వరకు వెళ్లి శత్రువులతో ఎలా పోరాడాడు అనేదే ఈ చిత్ర కథ. చాలా కాలం తర్వాత అతిలోక సుందరి శ్రీదేవి నేరుగా నటించిన తెలుగు చిత్రం ఇది. నాగార్జున, శ్రీదేవిల కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణ. రామ్ గోపాల్ వర్మ టేకింగ్, ఎస్.గోపాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ ఆరోజుల్లోనే హాలీవుడ్ స్థాయిలో ఉండేవి. ముఖ్యంగా తిరుపతి కొండల మీద చిత్రీకరించిన సన్నివేశాలు చాలా కొత్తగా ఉంటాయి. ఈ సినిమాలోని పాటలు అప్పట్లో సెన్సేషన్. ముఖ్యంగా "అందమా అందమా", "ఓ నవీనా", "అమ్మ బ్రహ్మదేవుడో" వంటి పాటలు ఇప్పటికీ ఎవర్ గ్రీన్. దైవత్వం మరియు యాక్షన్ : పురాణాల నేపథ్యాన్ని (శ్రీనివాస కళ్యాణం) ఆధునిక క్రైమ్ థ్రిల్లర్‌కు ముడిపెట్టిన విధానం ఆకట్టుకుంటుంది. క్లైమాక్స్‌లో ఒక చిన్న బాబు (వేంకటేశ్వర స్వామి అవతారంగా) వచ్చి హీరోకి సహాయం చేసే సీన్ హైలైట్‌గా నిలుస్తుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించినంత పెద్ద విజయం సాధించకపోయినా, టెక్నికల్ పరంగా తెలుగు సినిమా స్థాయిని పెంచిన చిత్రంగా గుర్తింపు పొందింది




# సీనియర్ నటి శారదకు జేసీ డానియల్ అవార్డు-2024

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 17 : సీనియర్ నటి శారదకు జేసీ డానియల్ అవార్డు-2024 కేరళ ప్రభుత్వం మలయాళ చిత్రసీమలో అత్యున్నత గౌరవంగా భావించే జేసీ డానియల్ అవార్డు-2024ను సీనియర్ నటి శారదకు ప్రకటించింది. మలయాళ సినిమాకు ఆమె చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. రూ.5 లక్షల నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో కూడిన ఈ అవార్డును ఈ నెల 25న ముఖ్యమంత్రి పినరయి విజయన్ అందజేస్తారు. ఈ అవార్డు పొందిన 32వ సినీ ప్రముఖురాలిగా శారద నిలిచారు.



# మయూరి క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు,
మయూరి న్యూస్ ఛానల్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శనివారం టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. మయూరి న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మయూరి న్యూస్ చానల్ ప్రతినిధి ద్రోణాదుల అజయ్, మంచిరాజు మురళీకృష్ణ, నవులూరి రాజా రమేష్ పాల్గొన్నారు..


# శాఖవరంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**పోటీల్లో విజేతలకు బహుమతులు అందించిన ఇంటూరి అవినాష్, సందీప్**

వలేటివారిపాలెం,
వలేటివారిపాలెం మండలం శాఖవరం గ్రామంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా ముగిశాయి. పండుగ వేడుకల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ట్రాక్టర్ రివర్స్ పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. చివరిగా చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. చివరగా జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుమారులు అవినాష్, సందీప్ లు ముఖ్యఅతిదులుగా హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలకు వారు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో శాఖవరం గ్రామం తెలుగు యువత, మహిళలు పాల్గొన్నారు.

# అర్చక,పురోహితులకు పంచాంగములు వితరణ

కందుకూరు, శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కందుకూరు మండలం కొండముడుసుపాలెం గ్రామంలోని శ్రీ శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో పరిసర ప్రాంత మండలాలలోని 60 మంది అర్చక,పురోహితులకు పంచాంగములను ఆలయ ప్రధాన అర్చకులు వాకాని శ్రీనివాసాచార్యులు, నారాయణం రాధాకృష్ణమాచార్యులు,సంస్థ ప్రతినిధి దీవి గాయత్రి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి,హైమావతమ్మ కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో పంచాంగములను పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు. .కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, అభ్యుధయ,పిన్నంరాజు వేణుగోపాల్,కందుకూరు కిషోర్ ఆచార్యులు,గణపతిరాజు నాగరాజు,కారంపూడి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు




Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com